సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం ၊ 2 ၊ అక్టోబర్ ၊ 2023



బాపూ...శాంతిమార్గమే చూపు!
ఆయన చూపు కరుణా వర్షం ఆ శాంతి సేనాని గాంధీజీ భరతమాతకు స్వేచ్ఛను తెచ్చి పెట్టాడు. గాంధీజీ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం. -8లో..



నిమజ్జనంలో అపశ్రుతి
ఎర్రగుంట్లలోని నడివూరులో వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. ఊరేగింపులో మంటలు ఎగిసి పడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. -8లో..

గరిష్ఠం/కనిష్ఠం
34.7/25.2

వాతావరణం
జిల్లాలో ఆదివారం 25.2 - 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో ఎర్రగుంట్లలో అత్యధికంగా 36 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తొండూరులో 23.6 , బద్వేల్‌లో 13.6, గోపవరంలో 11.4 , లింగాల్లో 11.2, ఖాజీపేటలో 6.4, ముద్దనూరులో 6.2, కమలాపురంలో 5.4, కొండాపురంలో 2.8, పులివెందుల్లో 2.2, వల్లూరులో 1.8 , జమ్మలమడుగులో 1, రాజుపాలెంలో 0.8, పొద్దుటూరులో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం వల్ల రబీలో ఆరుతపడి పంటల సాగుకు మేలు జరగనుంది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో కోచ్ శ్రీరాంసింగ్

ఎర్రగుంట్ల: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)కి చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆర్టీపీపీ డీఏవీ స్కూల్ కోచ్ శ్రీనివాస్‌సింగ్ ఆదివారం తెలిపారు. వి. నాగ నవీన, వి. నాగ తనూజ రాష్ట్ర అథ్లెటిక్స్ వంద మీటర్ల పరుగు పందెం, హ్యామర్‌త్రోలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు వరంగల్‌లో జాతీయస్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వీరిద్దరు అర్హత సాధించారన్నారు.కార్యక్రమంలో డీఏవీ స్కూల్ పీఈటీ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు గడువు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: అహ్మదాబాద్–తిరుచునాపల్లి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైలు గడువును డిసెంబరు 3వ తేదీ వరకు పొడిగించామని కడప రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. అహ్మదాబాద్–తిరుచునాపల్లి (09419) రైలు ప్రతి గురువారం ఉదయం 9.30 గంటలకు అహ్మదాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10 గంటలకు కడపకు చేరుకుని శనివారం తెల్లవారుజామున 3.45 గంటలకు తిరుచునాపల్లికి చేరుతుందన్నారు. ప్రతి ఆదివారం ఉదయం 5.40 గంటలకు తిరుచునాపల్లిలో బయలుదేరి రాత్రి 8.25 గంటలకు కడపకు చేరుకుని సోమవారం సాయంత్రం 9.15 గంటలకు అహ్మదాబాద్ చేరుతుందన్నారు. ఈ రైలు అక్టోబరు 5, 12, 19, 26, నవంబరు 2, 9, 16, 23, 30 తేదీల్లో అహ్మదాబాద్‌లో, అక్టోబరు 8, 15, 22, 29, నవంబరు 5, 12, 19, 26, డిసెంబరు 3న తిరుచునాపల్లిలో బయలుదేరుతుందన్నారు. ప్రయాణీకుల రద్దీని పురస్కరించుకుని ఈ ప్రత్యేక రైలును నడపనున్నారని తెలిపారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం



అండర్-19 నెట్‌బాల్ బాల, బాలికల జిల్లా జట్లు


మదనపల్లె సిటీ: క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చిత్తూరు, అన్నమయ్య జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు జయరామయ్య, వసంత అన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-19 బాల,బాలికల జిల్లా స్థాయి ఫుట్‌బాల్, బీటీ కాలేజీ మైదానంలో అండర్-19 బాల,బాలికల బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ జట్ల ఎంపికలు జరిగాయి. ఎంపికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయరామయ్య మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జట్ల ఎంపికలు జరిగినట్లు తెలిపారు. ఎంపికైన జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఈనెల 7, 8, 9 తేదీల్లో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో అండర్-19 ఫుట్‌బాల్ బాల,బాలికల రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డన్నశెట్టి, రాజగోపాల్, నారాయణ, ఆంజనేయులు, ఆర్గనైజర్లు నాగరాజ, సుధాకర్‌లు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలు ముఖ్యమే

రాయచోటి టౌన్: చదువుతోపాటు ఆటలు ముఖ్యమేనని అన్నమయ్య జిల్లా క్రీడా శాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. శాప్ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ సెలెక్షన్‌లో భాగంగా వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, హాకీ, బ్యాడ్మింటన్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు పందెం వర్టికల్ జంప్, 30 మీటర్ల ఫ్లైయింట్ స్టార్ట్, షటిల్ రన్ వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ శిబిరంలో సెలెక్షన్ అయిన వారు రాష్ట్ర స్థాయి అకాడమీలో పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలెక్షన్ సభ్యులు నరసరాజు, షామీర్ బాషా, బాలశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిరకాల స్వప్నం..సాకారం

- జిల్లా వ్యాప్తంగా 452 లే అవుట్లలో నిర్మాణం
- జిల్లా వ్యాప్తంగా 1,00,128 ఇళ్లు మంజూరు
- కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం



యర్రగుంట్లలోని ఓ లేవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

కడప సిటీ: గూడు లేక, అద్దె చెల్లించలేక కుటుంబ జీవనం బరువై అల్లాడుతున్న పేదలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడిలా నిలిచారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అర్హులందరికీ సొంతింటి కల సాకారం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాన్ని గాలికి వదిలేయగా, వైఎస్సార్ ప్రభుత్వం సీఎం అధికారం చేపట్టాక వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం చేపట్టి.. పేదలకు ఆసరాగా నిలిచారు.

- జిల్లాలో 452 జగనన్న కాలనీ లేఅవుట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు 1,00,128 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 28,637 పూర్తి కాగా, శ్లాబ్ స్థాయిలో 4028, గోడల వరకు 10,985, బేస్‌మెంట్ లెవెల్‌లో 35,696 ఇళ్లు ఉన్నాయి. ఇళ్ల నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ. 977 కోట్లు ఖర్చుచేశారు. అర్హులైన ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని ప్రభుత్వం కేటాయించడమేగాక, ఆర్థిక స్థోమత లేక ప్రారంభించని లబ్ధిదారులకు స్థాయిని బట్టి రూ.20వేల వరకు అడ్వాన్స్ రూపంలో చెల్లించింది. జిల్లా వ్యాప్తంగా 23,956 మందికి అడ్వాన్స్ రూపంలో రూ. 46.04 కోట్లు ప్రభుత్వం చెల్లించింది. మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతూ ముందుకు సాగుతోంది.

లే అవుట్లు ఇలా!

ఇళ్ల నిర్మాణం మూడు విధాలుగా జరుగుతోంది. ప్రభుత్వ స్థలంలో నిర్మించుకోవడం, సొంత స్థలం ఉన్నా.. కట్టుకునే స్థోమత లేకపోవడంతో గుర్తించి ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇప్పటి వరకు బద్వేల్‌లో 69, జమ్మలమడుగు 81, కడప 16, కమలాపురం 48, మైదుకూరు 62, ప్రొద్దుటూరు 36, పులివెందుల 102 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. మొత్తం 452 లే అవుట్లలో 1,00,128 ఇళ్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటులో ఇల్లు కట్టుకునేలా ఏర్పాట్లు చేశారు.

పూర్తిగా రిజిస్ట్రేషన్లు

'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కింద లబ్ధిదారుల ఇంటికి ప్రభుత్వం సర్వహక్కులు కలిస్తోంది. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రిజిస్ట్రేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు 1,00,128 ఇళ్లు మంజూరు కాగా, వీటన్నింటికీ రిజిస్ట్రేషన్ పూర్తయింది. రూరల్ ప్రాంతాల్లో అయితే రూ.10 వేలు, మున్సిపాలిటీల్లో రూ.15 వేలు, నగర పాలక సంస్థల్లో రూ.20 వేలు రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించిన తర్వాత అందుబాటులో ఉన్న సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ విధానంతో లబ్ధిదారులు తమ ఇళ్లను తనఖా పెట్టుకుని రుణాన్ని పొందే అవకాశం ఉంటుంది.

రూ.1.80లక్షలు మంజూరు

ఇంటి నిర్మాణానికి రూ. 1.80 లక్షలు ప్రభుత్వం అందజేస్తోంది. బేస్ మెంట్‌కు రూ. 60వేలు, గోడలకు రూ.60 వేలు, శ్లాబ్‌కు రూ.30వేలు, పూర్తయిన తర్వాత రూ. 30 వేలు మొత్తం రూ.1.80 లక్షలు లబ్ధిదారులకు అందజేస్తారు. అంతేగాక స్వయం సహాయక సంఘాల మహిళలకు మెప్మా ద్వారా మరో రూ. 35 వేల రుణం తీసుకునే సదుపాయం ఉంటుంది. ఈ మొత్తాన్ని మాత్రమే లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. మిగతా మొత్తాన్ని చెల్లించాల్సిన అవసరం లేదు.

ప్రారంభోత్సవానికి సన్నాహాలు

ఇళ్ల నిర్మాణాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. వేంపల్లె మండలం చింతలమడుగుపల్లె లే అవుట్‌ను ఇందుకు వేదికగా తీసు కున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ 500 ప్లాట్లు ఉండగా, 373 ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 176 ఇళ్లు పూర్తయ్యాయి. 32 ఇళ్లకు శ్లాబ్‌లు వేశారు. మిగతా నిర్మాణాలను చేపట్టి ఈసారి జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటించే సమయంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దరఖాస్తు చేసుకునే అవకాశం



ప్రస్తుతం కొత్త ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి. భార్యాభర్తలకు సంబంధించిన ఆధార్ కార్డులు, పొజిషన్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, జగనన్న లే అవుట్ పట్టా, హద్దుల వివరణ ఉండాలి. బ్యాంకు పాస్ పుస్తకం, ఫొటో, మొబైల్ నెంబర్ కూడా ఇవ్వాలి. స్వంత స్థలం ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. - కృష్ణయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, హౌసింగ్, కడప

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



సొంతింటి నిర్మాణం కలగానే మిగులుతుందని అనుకునేదాన్ని. ఎప్పుడూ బాడుగ ఇళ్లల్లోనే కాలం గడపాల్సి వస్తుందని మదనపడేవారం. మాలాంటి పేదలకు నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా ఇంటి నిర్మాణం చేయడంతో కల సాకారమవుతోంది. మాకు చింతలమడుగుపల్లె లేఅవుట్‌లో ఇల్లు మంజూరైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. - షేక్ బీబి యాస్మిన్, పాతపేటవీధి, వేంపల్లె

జగనన్న ఇళ్లు మా స్వప్నం



మా కల నేరవేరుతోంది. సొంతింటిలో చేరేందుకు సమయం ఆసన్నమైంది. అద్దె చెల్లించలేక ఒకవైపు జీవనం సాగించలేక ఇబ్బందులు పడుతున్న మాకు జగనన్న ఇళ్లు మా స్వప్నం లాంటిది. మాలాంటి పేద వారికి ఈ ప్రభుత్వం గూడు కల్పించడం హర్షణీయం. నాకు వేంపల్లె రాజీవ్ కాలనీ ఏరియాలో ఉన్న లేఅవుట్‌లో ఇల్లు మంజూరైంది. - షేక్ కరీమున్, కతీఫ్ వీధి, వేంపల్లె

గర్భిణులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

- వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి

కడప రూరల్: జగనన్న ఆరోగ సురక్ష కార్యక్రమలో భాగంగా అనారోగ్యంతో ఉన్న గర్భిణులు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలోని ఛాంబర్‌లో నోడల్, మానిటరింగ్ ఆఫీసర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 30 రోజుల పాటు జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా అస్వస్థతకు గురైన గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదికల ఆధారంగా తగిన మందులను ఇవ్వాలని, వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేయాలన్నారు. మెడికల్ క్యాంపుల్లో ప్రజలు గుమికూడకుండా వారు టైం స్లాట్ ప్రకారం వచ్చేలా చూడాలన్నారు. వైద్య శిబిరాలకు వైద్యులు ఉదయం 9 గంటలకు వచ్చి సాయంత్రం 5 వరకు విధులను నిర్వర్తించాలన్నారు. అనంతరం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఆవరణలో పరిశుభ్రతా పనులను చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, వైద్యులు ఉమామహేశ్వర్‌కుమార్, శశిభూషణ్‌రెడ్డి, లక్ష్మీకర్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి

పింఛన్ పరవశం..!

కడప రూరల్: ఒకటో తేదీ వచ్చిందంటే వానొచ్చినా.. వరదొచ్చినా.. సెలవొచ్చినా ఠంచన్‌గా పింఛన్ పంపిణీ జరుగుతుంది. వైఎస్సార్ పింఛన్ కానుక కింద ఆదివారం జిల్లా వ్యాప్తంగా వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ జరిగింది. తెల్లవారకముందే అవ్వాతాతల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ నగదును అందజేశారు.దీంతో పండుటాకులు ఆనందం వ్యక్తం చేశారు. జిల్లాలో 2,64,880 మందికి రూ.73.10కోట్ల పంపిణీకి చర్యలు చేపట్టారు.



లక్ష్మీదేవికి నగదును ఇస్తున్న వలంటీర్ హరిత

ఠంచన్‌గా పింఛన్ వస్తోంది

ఇక్కడ చిరునవ్వులు చిందిస్తూ దివ్యాంగుల పింఛన్ తీసుకుంటున్న మహిళ పేరు జి. లక్ష్మీదేవి. చెన్నూరు మండలం శివాలపల్లె. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ హరిత వెవెళ్లి డబ్బు అందజేసింది. ఒకటో తారీఖున ఠంచన్‌గా పింఛన్ వస్తోందని లక్ష్మీదేవి సంతోషం వ్యక్తం చేసింది.

వైవీయూ వసతిగృహాల్లో ఆటలకు చోటు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు అధికారులు శుభవార్తను అందించారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న చెయ్యేరు, పాపాఘ్ని, చిత్రావతి, పెన్నా వసతిగృహాల్లో విద్యార్థుల సౌకర్యార్థం 5 బ్యాడ్మింటన్ షటిల్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డిల పర్యవేక్షణలో వైవీయూ వ్యాయామశాస్త్ర శాఖ, క్రీడావిభాగం ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి అయ్యే వ్యయం, నిర్మాణ పనులను క్రీడావిభాగానికి అప్పజెప్పారు. దీంతో విద్యార్థుల్లో సంతోషం నెలకొంది. త్వరలోనే బ్యాడ్మింటన్ కోర్టుల నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు ప్రకటించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



కడప అర్బన్: సైబర్ నేరగాళ్లు వివిధ రకాలుగా అమాయకులను మోసగిస్తూ నగదును కాజేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. జిల్లాలో సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ షాపింగ్ పేరిట, స్క్రాచ్ కార్డులు అంటూ మోసం చేస్తున్నారన్నారు. సులువుగా అప్పు లభిస్తుందని ఫేక్ లోన్ యాప్స్ వలలో చిక్కుకోవద్దని సూచించారు. చిన్న మొత్తంలో అప్పు ఇచ్చి మీ నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బు కట్టించే విధంగా మోసగాళ్లు బెదిరిస్తారని, మానసిక క్షోభకు గురిచేస్తారన్నారు.అనధికార లోన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసేటపుడు మీ కాంటాక్ట్స్, మీడియా, గ్యాలరీలకు సంబంధించి ఎటువంటి పర్మిషన్లు ఇవ్వకూడదన్నారు. ఉద్యోగాలు, యాడ్స్ ప్రమోషన్‌తో భారీ ఆదాయం సంపాదించుకోండని మొబైల్‌కు మెసేజ్ పంపి మాయమాటలతో సైబర్ నేరగాళ్లు వలవేస్తారన్నారు.

- ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీల పేరుతో, ఆధార్ వేలిముద్రలతో సైబర్ మోసాలు జరుగుతున్నాయన్నాయన్నారు. ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ద్వారా వేలిముద్రలను ఉపయోగించి మీ ఖాతా నుంచి డబ్బులను డ్రా చేసుకుంటారన్నారు. ఈ విధానం ద్వారా రోజుకు ఒకసారి రూ. 10వేల లోపు బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి సైబర్‌నేరగాళ్లు కాజేస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ తమ ఆధార్‌ను లాక్ చేసుకునే విధానాన్ని తెలుసుకోవాలన్నారు. సైబర్‌నేరగాళ్ల బారినపడ్డ బాధితులు వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్‌సీఆర్‌పీ)లో టోల్‌ఫ్రీ నెంబర్. 1930కు ఫిర్యాదు చేయడం కీలకమని ఎస్పీ సూచించారు.

రేపటి నుంచి ఫార్మేటివ్ -2 పరీక్షలు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను వెలికి తీసేందుకు నిర్వహించే ఫార్మేటివ్-2 పరీక్షలు అక్టోబర్ 3వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రారంభంకానున్నాయి. ఇందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి.1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్ష పత్రాం ద్వారా పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. ఫార్మేటివ్-2 పరీక్షలు పాత విధానంలో జరుపుతారు.



విద్యార్థులు

షెడ్యూల్ ఇదీ..


- జిల్లాలో 2 వేల ప్రభుత్వ, 67 ఎయిడెడ్, 775 ప్రైవేటు పాఠశాలల్లో 3,13,696 మంది విద్యార్థులు ఉన్నారు. వీటిలో ఎఫ్‌ఏ -2 పరీక్షలు అక్టోబర్ 3,4 తేదీల్లో 1 నుంచి 5 తరగతి విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం రెండు విడుదలుగా నిర్వహిస్తారు. 3న తెలుగు, గణితం, 4న ఇంగ్లీషు, ఎన్విరాన్‌మెంట్ సైన్స్(ఈవీఎస్), పరీక్షలు నిర్వహిస్తారు. 5న 3,5 తరగతుల వారికి ఓఎస్‌ఎస్‌సీ పరీక్ష ఉదయం నిర్వహిస్తారు.
- 6,7,8 తరగతుల వారికి ఉదయం, సాయంత్రం పరీక్షలు నిర్వహిస్తారు. 3న తెలుగు, గణితం, 4న హిందీ, జనరల్ సైన్స్, 5న సోషియల్, ఇంగ్లీషు, 6న ఓఎస్‌ఎస్‌సీ-1, ఓఎస్‌ఎస్‌సీ-2 పరీక్షలు నిర్వహిస్తారు.
- 9,10 తరగతులకు ఉదయం, సాయంత్రం పరీక్షలు జరుగుతాయి. 3న తెలుగు, గణితం, 4న హిందీ జనరల్ సైన్స్, 5న ఇంగ్లీషు సోషియల్, 6న ఓఎస్‌ఎస్‌సీ-1 ఓఎస్‌ఎస్‌సి-2 పరీక్షలు నిర్వహిస్తారు.
- ప్రశ్నపత్రాన్ని బ్లాక్‌బోర్డుపై ఉపాధ్యాయులు రాయగా, విద్యార్థులు పేపర్‌ను నమోదు చేసుకుని సమధానాలు రాయాల్సి ఉంటుంది. ఎఫ్‌ఏ-2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్లను సరఫరా చేయడం లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష పేపర్లను ఆన్‌లైన్‌లో గంట ముందుగా వ్యాట్సాప్స్ ద్వారా డీసీఈబీవారు పంపిస్తారు.

వాట్సాప్ ద్వారా ప్రశ్నపత్రాలు పంపుతాం



ఫార్మేటివ్-2 ప్రశ్నపత్రాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వాట్సాప్ ద్వారా గంట ముందు పంపుతాం.వీటిని డౌన్‌లోడ్ చేసుకుని పరీక్ష నిర్వహించాలి. - శంకరయ్య, డీసీఈబీ సెక్రెటరీ, కడప

జాగ్రత్తలు తీసుకోవాలి



ఫార్మేటివ్ -2 పరీక్షల్లో పొరపాట్లు జరగకుండా ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తలు తీసుకోవాలి. వాట్సాప్ ద్వారా పరీక్షకు గంట ముందు ప్రశ్నపత్రం వస్తుంది. ఏదైనా పొరపాటు జరిగితే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. - ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

ఒక్కటైన ఆ ముగ్గురు..!

- టీడీపీ నేతల మధ్య తెరపైకి ఆధిపత్య పోరు
- నాన్‌లోకల్ అభ్యర్థులకు సహకరించేది లేదు
- తేల్చి చెబుతున్న కడప నియోజకవర్గ నేతలు
- మాధవీరెడ్డి ప్రమేయం లేకుండా ప్రత్యేక కార్యక్రమాలు
- స్థానికతను పరిగణనలోకి తీసుకోవాలని ఆరాటం



దేవునికడపలో ఆలయానికి వచ్చిన కార్పొరేటర్ ఉమాదేవి, ఇతర మహిళా నేతలు

సాక్షి ప్రతినిధి, కడప: 'ఎంత కాలమైనా పల్లకీ మోసే బోయీలుగానే మిగిలిపోవాలా.. నాయకత్వ పగ్గాలు పుచ్చుకునే అర్హత మాలో ఎవరికీ లేదా.. నాన్ లోకల్ అభ్యర్థిని మాపై రుద్దుతారా' అని కడప టీడీపీ నేతలు మండిపడుతున్నారు. పార్టీ విజయం కోసం కలిసికట్టుగా పని చేస్తామని, మాలో ఒకరికి టికెట్ కేటాయించాలని కోరుతూనే, నాన్‌లోకల్ అభ్యర్థికి సహకరించబోమని తెగేసి చెబుతున్నారు. వెరసి తెలుగుతమ్ముళ్ల మధ్య ఉన్న కోల్డ్‌వార్ తెరపైకి వచ్చింది. ఇన్‌చార్జితో ప్రమేయం లేకుండా ఆ ముగ్గురు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే దిశగా అడుగులు వేస్తున్నారు. తాజాగా చంద్రబాబు విడుదల కావాలని దేవునికడప శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొట్టారు. టీడీపీ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తన కోడలు, కార్పొరేటర్ ఉమాదేవికి నియోజకవర్గ ఇన్‌చార్జి అభ్యర్థిత్వం కోసం పోటీ పడ్డారు. ఆ స్థానంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి సతీమణి మాధవీరెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించారు. అప్పటికే పలుమార్లు అధినేత చంద్రబాబుతో ప్రత్యేకంగా సమావేశమై స్థానికులకు అవకాశం కల్పించాలని కడప నేతలు కోరారు. గతంలో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన దుర్గాప్రసాద్, అమీర్‌బాబుకు అవకాశం కల్పించాలని, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తే కార్పొరేటర్ ఉమాదేవికి ఇన్‌చార్జి పదవి ఇవ్వాలని విన్నవించారు. మాలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసికట్టుగా పని చేస్తామని తెలిపారు. వీరి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోకుండా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డికి కడప పట్టం కట్టడాన్ని.. ఆ ముగ్గురు నేతలు వ్యతిరేకిస్తున్నారు. స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వకుంటే సహకరించేది లేదని తెగేసి చెబుతున్నారు.

ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ

ఎన్నికల్లో గెలుపు ఓటములు ఎలా ఉన్నా.. అభ్యర్థిగా స్థానికులనే నిర్ణయించాలని కడప గడపలో తెలుగు తమ్ముళ్లు పట్టుబట్టుతున్నారు. స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తల ప్రమేయం లేకుండా నాన్‌లోకల్ అభ్యర్థిని పరిగణనలోకి తీసుకుంటే ఎన్నికల్లో ఏమి చేయగలరని వాదిస్తున్నారు. అదే విషయాన్ని అధినేత చంద్రబాబుకే తేల్చి చెప్పామని టీడీపీ విజయం సాధించాలంటే లోకల్ వారిని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇన్‌చార్జి మాధవీరెడ్డితో కలిసి పని చేసే పరిస్థితే లేదని తేల్చి చెబుతున్నారు. ఆ మేరకు ఆమెతో ప్రమేయం లేకుండా ప్రత్యేకంగా కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ చేపట్టారు. ఈ వ్యవహారం వినాయక ఉత్సవాల నుంచి కొనసాగుతోంది. టీడీపీ నేతలు లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్, అమీర్‌బాబు ముగ్గురు కలిసికట్టుగా వినాయక మండపాలను సందర్శిస్తూ పూజలు చేపట్టారు. మాధవీరెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలకు సైతం దూరంగా ఉండిపోయారు. తాజాగా ఆదివారం ఆ ముగ్గురు నేతలతో పాటు మరి కొందరు డివిజన్ల ఇన్‌చార్జిలతో కలిసి దేవునికడపలో 101 టెంకాయలు కొట్టారు. సోమవారం నుంచి పాతబస్టాండ్ సమీపంలో నిరసన టెంట్ ఏర్పాటు చేసి, వేరుగా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. లోకల్ నాయకుల్ని అందర్నీ కలుపుకొని కార్యక్రమాలకు వెళ్లాలనే దిశగా ఆ ముగ్గురు అడుగులు వేస్తున్నారు. నాన్ లోకల్ అభ్యర్థికి ఇప్పటి నుంచే పోటీగా కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు.

వాసు ఏకపక్ష వైఖరి సహించం

'టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా అందర్నీ కలుపుగోలుగా వెళ్లలేదు. పొలిట్‌బ్యూరో సభ్యుడు జిల్లాలోని టీడీపీ నేతల మన్ననలు పొందలేదు. పైగా వర్గ విభేదాలకు ఆస్కారం ఇచ్చేలా చర్యలుండిపోయాయి. వాసు ఏకపక్ష వైఖరి నేపథ్యంలో అభ్యర్థిగా మాధవీరెడ్డి నియామకాన్ని అడ్డుకునే చర్యలకు దిగినట్లు' ఆ ముగ్గురు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ ఆమెకే టీడీపీ టికెట్ కేటాయిస్తే ఓడగొట్టి తీరుతామని ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి బాహాటంగా ప్రకటిస్తున్నారు. ఇదే విషయాన్ని కార్యకర్తలకు, ప్రజలకు వివరించేందుకు సిద్ధమయ్యారు.

క్లుప్తంగా

హత్యాయత్నం ఘటనలో నలుగురి అరెస్టు

కొండాపురం : మండల పరిధిలోని తాళ్లప్రొద్దుటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. హరినారాయణరెడ్డి పై హత్యాయత్నానికి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన హరినారాయణరెడ్డిపై ఇటీవల జరిగిన హత్యాయత్నం జరిగిందన్నారు. ఈ సంఘటనకు సంబంధించి అదే గ్రామానికి చెందిన వెంకట పుల్లయ్య, అనంతపురం జిల్లా కణేకల్లుకు చెందిన అద్నాన్ రజాక్, రామాంజినేయులు (పార్థు), పెద్దపప్పూరు మండలానికి చెందిన చంద్రోశేఖర్‌లను అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి


ఆటోలోనే కుప్పకూలిన గోపాల్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నెహ్రూనగర్‌కు చెందిన గోపాల్ (55) అనే ఆటోడ్రైవర్ ఆదివారం సాయంత్రం తాను నడుపుతున్న ఆటోలోనే రక్తం కక్కుకుని మృతి చెందాడు. అనారోగ్యంతో మృతి చెందాడా? లేక మరే కారణమా అనేది తెలియాల్సి ఉంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గూడ్స్ రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి..


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం రైల్వే ఎస్‌ఐ రారాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి సుమారు 35 ఏళ్లు ఉంటాయని ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎర్రగుంట్ల రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

సాగర్ ఎడమ కాలువలో జారిపడిన వృద్ధురాలు


ఒడ్డుకు చేరిన జ్ఞానమ్మతో గ్రామస్తులు, పోలీసులు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని నరసన్నపల్లె ఎస్సీ కాలనీకి చెందిన జ్ఞానమ్మ అనే వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ పనికి వెళ్లి తిరిగి వస్తూ సమీపంలోని సాగర్ ఎడమ కాలువలో కాలు జారి పడి పోయింది. ఆమె నీళ్లలో లింగాలదిన్నెపల్లె దగ్గరలోని పోరుమామిళ్ళ- మైదుకూరు రహదారి బ్రిడ్జి దగ్గరకు రాగా పశువుల కాపరులు, స్థానికులు గుర్తించారు. ఇంతలో బి.మఠం పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సాయంతో ఒడ్డుకు చేర్చారు. పోలీసులు వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

బాపూ...శాంతిమార్గమే చూపు!

నేడు గాంధీ జయంతి

కడప కల్చరల్ : ఆయన సాధారణ మానవుడు. అయినా ప్రపంచ వ్యాప్తంగా దేవుడిలా ఆరాధిస్తారు. అందుకే దేశమంతటా ఆయన విగ్రహాలున్నాయి. ప్రజల హృదయాల్లో చిరస్థానం ఉంది. ఆయన చూపు కరుణా వర్షం. ఆగ్రహం వంద తుపాకుల పేలుడంత తీవ్రం. ఆయన అడుగు లక్షలాది ప్రజలకు మార్గదర్శనం. ఆయన పిలుపు భారతజాతికి మేలు కొలుపు. నిరాడంబరమైన ఆ మూర్తి దేశ ప్రజలకు స్ఫూర్తి. ఆ శాంతి సేనాని గాంధీజీ భరత మాతకు స్వేచ్ఛను తెచ్చి పెట్టాడు. దేశమాత రుణం తీర్చుకున్నాడు. దేశ వాసులకు మరో దేవుడయ్యాడు. ప్రపంచమంతటా కీర్తి గడించాడు. నేడు ఆయన జయంతి. ఈ సందర్భంగా మన జిల్లాలో ఆయనకు సంబంధించిన విశేషాలు.

జిల్లాలో గాంధీజీ విగ్రహాలు 100కి పైగానే ఉన్నాయి. చిన్నా చితకా మరో వంద దాకా ఉన్నాయి. కేవలం కడప నగరంలోనే మూడు విగ్రహాలు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశారు. మొదట వన్‌టౌన్ కూడలిలో స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా స్థానిక ఆర్యవైశ్యులు చిన్న దిమ్మెపై గాంధీజీ చిన్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. 1950లో ఆ విగ్రహం స్థానంలో ప్రస్తుతమున్న విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మద్రాసు ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ ప్రతినిధి కె.చంద్రమౌళి స్థానిక దాత నారాయణరెడ్డి సహకారంతో ఆ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి మున్సిపల్ చైర్మన్ పుల్లగూర శేషయ్య ఆధ్వర్యంలో కమిషనర్ బసప్ప విగ్రహం ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీన్ని ఒకటో గాంధీ బొమ్మగా వ్యవహరిస్తున్నారు.


కడప నగరంలోని రెండో గాంధీబొమ్మ

రెండో గాంధీ బొమ్మ


కడపలో గాంధీజీ విశ్రమించిన గృహం

కడప నగరంలోని మూర్తి ఫొటోస్టూడియో సర్కిల్‌లో గాంధీజీ మరణించిన సందర్భంగా ఆయన సంస్మరణగా 12.2.1948లో స్థానిక భూస్వామి, దాత వీసీ నారాయణస్వామి సహకారంతో నాటి ఆంగ్లేయ అధికారి ఎస్.మిచల్ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ వీధికి గాంధీరోడ్డుగా నామకరణం చేశారు. అయినా దీన్ని రెండవ గాంధీ బొమ్మ సర్కిల్‌గాను, గాంధీవీధిగాను వ్యవహరిస్తున్నారు. స్థానిక ఐటీఐ సర్కిల్‌లో 2002 అక్టోబరు 2న ఆర్యవైశ్య సేవా సంఘం విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, దాన్ని 2017లో పునర్నిర్మించి కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అక్కడ స్టేజీ, షెల్టర్‌ను ఏర్పాటు చేసి దానికి గాంధీ ఐటీఐ సర్కిల్ అని నామకరణం చేశారు. జిల్లాలో దాదాపు అన్ని పట్టణాల్లోనూ ఎక్కువ శాతం మండలాల్లోనూ గాంధీ పేరిట వీధులు ఉన్నాయి.

పాదస్పర్శతో పులకించిన నేల

సహాయ నిరాకరణ ఉద్యమ సారధిగా బాపూజీ 1921 సెప్టెంబరు 28న జిల్లాలో తొలిసారిగా పర్యటించారు. రాజంపేట అనంతరం కడప నగరానికి చేరుకుని మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించారు. రెండవసారి 1929 మే 17న కస్తూర్బాతో కలిసి కడప నగరానికి వచ్చారు. కొండాపురం, మంగపట్నం, చిలంకూరు, నిడిజువ్వి, ఎర్రగుంట్ల ద్వారా రాత్రి 11 గంటలకు ప్రొద్దుటూరుకు చేరారు. 18న సతీమణితో కలిసి వసంతపేటలో ప్రజలతో మాట్లాడి స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి నింపారు. జిల్లా ప్రముఖులు కోటిరెడ్డితో కలిసి చాగలమర్రికి వెళ్లారు. 1933 డిసెంబరు 31న రాత్రి 7.30 గంటలకు మూడవసారి గాంధీజీ కడపలో పర్యటించారు. జిల్లా ప్రముఖులు దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి ఇంటిలో విడిది చేశారు. హరిజనోద్ధరణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. 1934 జనవరి 2న మరోసారి ఆయన జిల్లాకు వచ్చారు. రెండు స్వదేశీ ఎంపోరియంలను ప్రారంభించారు. దళితవాడ (మాసాపేట)ను సందర్శించి అక్కడి స్థితిగతులను గురించి స్థానిక యువతతో మాట్లాడారు. తర్వాత మున్సిపల్ హైస్కూలు మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఉపన్యసించారు.

జిల్లా ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్ మృతి


మృతి చెందిన స్టాఫ్‌నర్స్ జీఎం అరుణకుమారి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్టాఫ్‌నర్స్ జీఎం అరుణకుమారి (54) మృతి చెందారు. నైట్ షిఫ్టులో భాగంగా శనివారం ఆమె విధులు నిర్వహిస్తూ ఆదివారం ఉదయం కళ్లు తిరిగి కింద పడిపోయారు. నర్సింగ్ సిబ్బంది హుటాహుటిన ఆమెను అత్యవసర విభాగానికి తరలించారు. గుండెపోటు వచ్చిందేమోననే అనుమానంతో వెంటనే పట్టణంలోని గుండె వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆమెకు భర్త వెంకటరమణతో పాటు వెంకటమన్యు అనే బీటెక్ చదువుతున్న కుమార్తె ఉన్నారు. 2019 నుంచి ఆమె ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల నుంచి ఆమెకు జ్వరం వస్తోందని, బీపీ కూడా ఉన్నట్లు భర్త తెలిపారు. డీసీహెచ్‌ఎస్ హిమబిందు ఆస్పత్రికి చేరుకొని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుతో మాట్లాడి జరిగిన సంఘటన గురించి తెలుసుకున్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

కాంతారా సినిమా పాటకు నృత్యం కోసం నిప్పు రాజేస్తుండగా ఎగిసిపడిన మంటలు.. ఐదుగురికి తీవ్ర గాయాలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని నడివూరులో కొలువుదీరిన వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం రాత్రి జరిగిన ఊరేగింపులో కొందరు యువకులు కాంతారా సినిమాలోని పాటకు డ్యాన్స్ చేస్తున్నారు. ఇదే సందర్భంలో ఓ వలయం గీసి దాని చుట్టూ పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఊరేగింపు చూడడానికి వచ్చిన జనాల్లోకి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో చైతన్య, ధనుష్, చందు, హేమశ్రీ, మరొకిరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎర్రగుంట్ల పట్టణ సీఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ వినాయక నిమజ్జన ఊరేగింపులో చోటుచేసుకున్న సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు 20 మందిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చెప్పారు.


కాంతారా సినిమా పాటకు నృత్యం కోసం చుట్టూ మంటలు వేసిన దృశ్యం

నలుగురు సస్పెన్షన్, సీఐ, ఎస్‌ఐలకు చార్జ్‌మెమోలు

కడప అర్బన్ : ఎర్రగుంట్ల నగర పంచాయతీలో శనివారం రాత్రి జరిగిన వినాయక నిమజ్జనం ఊరేగింపులో అపశ్రుతి సంఘటనను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ సీరియస్‌గా తీసుకున్నారు. ప్రాథమిక విచారణ మేరకు బందోబస్తు విధుల్లో పాల్గొన్న ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్రగుంట్ల సీఐ ఈశ్వరయ్య, ఎస్‌ఐలు పి. ప్రవీణ్‌కుమార్, హెచ్. కృష్ణంరాజు నాయక్‌లకు చార్జ్ మెమో ఇచ్చారు.

ఎలుగుబంటి దాడిలో యువకుడికి గాయాలు


ఎలుగుబంటి దాడిలో గాయపడిన కాశీరావు

బ్రహ్మంగారిమఠం : మండలంలోని రేకలకుంట పంచాయతీ ఆర్.గొల్లపల్లెకు చెందిన కాశీరావు ఆదివారం తెల్లవారుజామున రేకలకుంటకు వస్తుండగా ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రుల కథనం మేరకు కాశీరావు రేకలకుంటకు వెళ్లి వస్తుండగా కంప చెట్లలో దాగిన ఎలుగు బంటి ఎదురుగా వచ్చింది. భయపడిన కాశీరావు పరుగుతీయగా వెంబడించి వంటిపై గోర్లతో బరికింది. బాధితుడిని వైద్యంకోసం కడప రిమ్స్‌కు తరలించారు.

ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలి

డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఆదర్శవంతంగా ఉండాలని డిప్యూటీ సీఎం అంజద్ బాషా పేర్కొన్నారు. ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) జిల్లాశాఖ తరపున ఆదివారం కడప బెల్లంమండి వీధిలోని మదరసా జెవారాలోని కాన్ఫరెన్స్ హాలులో 13 మంది ఉపాధ్యాయులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులను ఆశించకుండా ఆదర్శవంతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఐటాయే ఎంపిక చేసి సన్మానించడం అభినందనీయమన్నారు. అవార్డులు తీసుకున్న ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా పనిచేసి విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఐటా జాతీయ ప్రధాన కార్యదర్శి మీర్ ముంతాజ్ అలీ మాట్లాడుతూ ఈ సంఘం కేవలం ఉపాధ్యాయుల హక్కుల కోసమే కాకుండా ఆదర్శ సమాజ నిర్మాణం కోసం పనిచేస్తుందన్నారు. ఐటా జాతీయ కార్యదర్శి షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ఐటా ఉపాధ్యాయులకు సమకాలీన అంశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం నగరంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ప్రవక్త మహమ్మద్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ చాటిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటా జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా, జిల్లా గౌరవాధ్యక్షులు మౌలానా గౌస్ అహ్మద్, నిజామ్, జిల్లా కార్యదర్శి అబ్బాస్‌అలీ, రాష్ట్ర ట్రెజరర్ ఫయాజుల్ రెహమాన్, జేఐహెచ్ అధ్యక్షుడు ఖాదర్‌వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

వయో వృద్ధుల యోగక్షేమాలను తెలుసుకోవాలి

జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : వయో వృద్ధుల యోగక్షేమాల విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని ఆజాద్ నగర్‌లో ఉన్న బృంద వృద్ధాశ్రమాన్ని సందర్శించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అనంతరం రిమ్స్ ఆవరణలో ఉన్న వన్‌స్టాప్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కాన్ఫరెన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయన్నారు. అలాగే కడప నగరంలోని మరియాపురం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహం-2 ను కూడా జడ్జి ప్రదీప్‌కుమార్ తమ సిబ్బందితో సందర్శించారు. విద్యార్థినులు సత్ప్రవర్తనతో విద్యను అభ్యసించాలన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

యోగివేమారెడ్డి అన్నదాన సత్రం సమావేశంలో ఉద్రిక్తత

- సమావేశాన్ని అడ్డుకున్న పూర్వ అధ్యక్షురాలు సిద్దేశ్వరి
- గేటు తాళం పగులకొట్టి లోనికి చేరిన కమిటీ సభ్యులు
- లోనికి వెళ్లిన వారిపై పెట్రోల్ చల్లి దాడికి యత్నం
- పోలీసుల జోక్యంతో ప్రశాంతంగా జరిగిన సమావేశం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని యోగి వేమారెడ్డి రెడ్ల నిత్య అన్నదాన సత్రంలో ఆదివారం ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. అన్నసత్రానికి ప్రస్తుతం 8 నెలలుగా అధ్యక్షురాలిగా ఉంటున్న అంకిరెడ్డిపల్లె సిద్దేశ్వరి సత్రానికి సహకరించిన దాతలు, భక్తుల పట్ల సరిగా ప్రవర్తించడం లేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో సిద్దేశ్వరిని సత్రం పాలనా వ్యవహారాలనుంచి తప్పించాలని సత్రానికి విరాళాలు ఇచ్చిన దాతలు, గదుల నిర్మాణ దాతలు ఆదివారం బ్రహ్మంగారిమఠంలోని రెడ్ల అన్నదాన సత్రంలో సమావేశం నిర్వహించేందుకు ఎంపీపీ సి.వీరనారాయణ రెడ్డి, ఎ.చిన్న ఓబుల్‌రెడ్డి, సర్పంచ్ ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. అక్కడే ఉన్న సిద్దేశ్వరిని గేటు తాళాలు తీయాలని కొంతమంది కమిటీ సభ్యులు కోరారు. ఈ సమయంలో సిద్దేశ్వరి వెంట ఉన్న కొంతమంది దురుసుగా మాట్లాడంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలోనే కమిటీ సభ్యులు తాళం పగులకొట్టి లోనికి చేరుకున్నారు. సత్రంలో ఒక గదిలో అప్పటికే సిద్ధంగా ఉన్న 5 లీటర్ల పెట్రోల్ క్యాన్‌తో ఒక్కసారిగా లోనికి వచ్చిన వారిపై పెట్రోల్ చల్లడంతో అక్కడ ఉన్నవారు భయంతో పరుగులు తీశారు. ఇంతలో బి.మఠం ఎస్‌ఐ విద్యాసాగర్, బద్వేల్ అర్బన్ సీఐ యుగంధర్, మహిళా ఎస్‌ఐ, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఘర్షణను నివారించి సమావేశాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే సత్రంలోని గదులను పోలీసులు పరిశీలించగా ఒక గదిలో ఉన్న డీజిల్ క్యాన్ , మూడు కత్తులు, కారం పొడిని స్వాధీనం చేసుకోని సిద్దేశ్వరిని బయటకు తీసుకుని వెళ్లారు. కాగా తనపై రెడ్డి సోదరులు దాడి చేశారని సిద్దేశ్వరి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. అయితే కమిటీ సభ్యులు మాత్రం ముందుగా ఆమెనే తమపై దాడి చేశారని ఆరోపించారు. పోలీసులు విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న పెట్రోల్, డీజిల్ క్యాన్లు


పోలీసులు తీసుకెళుతున్న కత్తులు

నూతన అధ్యక్షుడిగా గంగిరెడ్డి

బ్రహ్మంగారిమఠంలో గత 32 ఏళ్లుగా కొనసాగుతున్న యోగి వేమారెడ్డి రెడ్ల నిత్య అన్నదాన సత్రం నూతన అధ్యక్షుడిగా పెండ్లిమర్రి మండలానికి చెందిన గంగిరెడ్డిని కమిటీ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బి.మఠం ఎంపీపీ చిలేకాంపల్లె వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ యోగి వేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రం దినదినాభివృద్ధి చెందడానికి రాయలసీమలోని రెడ్ల సహకారం అలాగే నూతన కమిటీ ఎన్నికకు జెడ్పీటీసీ ఎం.రామగోవింద రెడ్డి సహకారం ఉందన్నారు. నూతన కమిటీ సభ్యులు సత్రాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. మాజీ అధ్యక్షుడు చౌదరివారిపల్లెకు చెందిన అంకిరెడ్డిపల్లె చిన్నఓబుల్‌రెడ్డి, కోటిరెడ్డి, పాలరామిరెడ్డి, సర్పంచ్ చిన్న ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి కృష్ణారెడ్డి, వివిధ జిల్లాల నుంచి పలువురు రెడ్లు పాల్గొన్నారు.



నువ్వులేక నేనుండలేను!

- భర్త మరణం జీర్ణించుకోలేక ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు

ముద్దనూరు : ఐదు నెలల క్రితం ఆమె భర్త విద్యుదాఘాతంతో మరణించాడు. అప్పటి నుంచి ఆమె భర్త గురించే ఆలోచిస్తూ.. బాధపడుతూ కాలం నెట్టుకొచ్చింది. చివరకు తన తోడు నీడ లాంటి భర్తే లేనప్పుడు ఇక తాను జీవించడం ఎందుకని భావించింది. ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజులగురువాయిపల్లెకు చెందిన రాజుల అమరేశ్వరి(24) సచివాలయ వలంటీర్‌గా విధులు నిర్వర్తించేది. ఆమె భర్త శివానందరెడ్డి ఇటీవల విద్యుదాఘాతానికి గురయ్యాడు. సుమారు 3 నెలల పాటు చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. చివరకు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో మరణించాడు. అప్పటినుంచి అమరేశ్వరి భర్త మరణాన్ని జీర్ణించుకోలేకపోతోంది. ఈ నేపథ్యంలో ఆమె ఆదివారం ఉదయం గ్రామంలో పింఛన్లు పంపిణీ చేసింది. అనంతరం ఇంటికి వచ్చి ఇద్దరు పిల్లలను ఆడుకోవడానికి బయటకు పంపించి ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అమ్మానాన్నల మృతితో ఆ చిన్నారులు అనాథలుగా మిగిలారు. ఈ విషాద సంఘటన గ్రామంలో అందరినీ కలచివేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


మృతి చెందిన అమరేశ్వరి

బస్సు, బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కాశినాయన : మండలంలోని అమగంపల్లె టీబీ ఆసుపత్రి వద్ద ఆదివారం బస్సు, మోటారు బైక్ ఢీకొని ఆకులనారాయణపల్లె గ్రామానికి చెందిన పూల సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుబ్బరాయుడు ద్విచక్ర వాహనంలో మైదుకూరుకు వెళుతున్నాడు. మైదుకూరు నుంచి గిద్దలూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో సుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ హరిప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్బరాయుడు

హైవే పెట్రోలింగ్ వాహనం ఢీకొని..

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని రిమ్స్ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం(డీటీసీ)లోకి వెళుతున్న హైవే పెట్రోలింగ్ వాహనాన్ని, సిద్దవటం వైపు నుంచి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సిద్దవటం మండలం పెద్దపల్లి పంచాయతీ మిట్టపల్లి గ్రామానికి చెందిన కాడే వెంకటరమణ తన ద్విచక్రవాహనానికి ముందు లారీలు వెళుతుండగా. సరిగ్గా డీటీసీ వద్ద కడప వైపు నుంచి వస్తున్న హైవే పెట్రోలింగ్ వాహనం లోపలికి తిప్పడంతో, నిలబడి ఉన్న లారీని ఓవర్‌టేక్ చేసి వచ్చిన ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన వెంకటరమణను ఆటోలో కడప రిమ్స్‌కు తరలించారు. విచారించి కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.


గాయపడిన వెంకటరమణను కడప రిమ్స్‌కు తరలిస్తున్న పోలీసులు

సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ కొత్త అపార్ట్‌మెంట్ బ్రోచర్ విడుదల

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డు, అంకుర ఆస్పత్రి సమీపంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఆర్ కాస్మోస్ హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్రోచర్‌ను ఆదివారం సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ చలపతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్లకు నూతనమైన సదుపాయాలతో 2బీహెచ్‌కే, 3బీహెచ్‌కే, 1230 స్క్వేర్ ఫీట్స్ నుంచి 2085 స్క్వేర్ ఫీట్స్ వరకు అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. విశాలవంతమైన అమినిటీస్ బ్లాక్ 15,000 స్క్వేర్ ఫీట్స్, క్రికెట్ పిచ్, బ్యాడ్మింటన్ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాకింగ్ ట్రాక్, జాగింగ్ ట్రాక్ వంటి ఎన్నో సదుపాయలు తమ కొత్త అపార్ట్‌మెంట్ వద్ద ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ డైరెక్టర్స్ హర్షితరెడ్డి, లోకేష్‌రెడ్డి, వినీషారెడ్డి, కాశీ విశ్వనాథ్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ సోమేశ్వర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సీపీఆర్ కాస్మోస్ హై రైజ్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇసుక రవాణాను అడ్డుకున్న ఇల్లూరు గ్రామస్తులు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఇల్లూరు గ్రామ సమీపంలో ఉన్న పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తుండగా ఆ గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గతంలో ఇసుక రీచ్ ఉండటం వల్ల అనుకున్న దానికంటే ఇసుకను అధికంగా తరలించారు. ఇప్పుడు మళ్లీ ఇసుకను తరలిస్తే నదిలో ఉన్న వ్యవసాయ బోర్లు, గ్రామానికి నీటి సరఫరా అందించే స్కీంలకు నీరు లేకుండా ఇంకిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఇసుక రవాణాను అడ్డుకున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఇల్లూరు గ్రామంలో ఇసుక రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్తులు